





# తొలి సమయం

దిన పత్రిక

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 359 గురువారం 26-12-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


## మాది పేదల ప్రభుత్వం

**- పేదలకు అనుకూలంగా నిర్ణయాలు**

**- మెదక్ చర్చి క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్ - వనదుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు**



**మెదక్,డిసెంబర్25:** వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు. మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏసు భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. వందేళ్లు పూర్తి చేసుకున్న మెదక్ చర్చి గొప్ప దేవాలయంగా గుర్తింపు పొందిందని తెలిపారు. చారిత్రక చర్చి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అలాగే మెదక్ చర్చితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తుచేశారు.శతాబ్ది ఉత్సవాలు, భక్తులతో క్రిస్మస్ జరుపుకోవాలనే ఇక్కడకు వచ్చానని తెలిపారు. తమది పేదల ప్రభుత్వమని.. పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో దళితులు, గిరిజనులకు మేలు జరుగుతోందన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు పొంగులేటి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు.కాగా.. మెదక్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు వన దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మెదక్ చేరుకున్న సీఎం రేవంత్.. అక్కడ ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మెదక్ చర్చికి చేరుకున్నారు. అక్కడ చర్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆపై అక్కడ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.

### అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత లేదు

**అల్లు అర్జున్ విషయంలో ఏదో మతలబు ఉంది: బండి**

**హైదరాబాద్,డిసెంబర్25:** అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకులేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. 'ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తాళాలు వేశారు. ఆయన చరిత్ర తెలిపేలా ఉన్న గదుల్లోకి వెళ్లనివ్వడం లేదు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డిఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదు. భాజపా ఒత్తిడి మేరకు గత భారాస ప్రభుత్వం ఆ విగ్రహ నిర్మాణం పూర్తి చేసింది. అంబేద్కర్‌కు సంబంధించిన పంచ తీర్థాలను రాహుల్ గాంధీ దర్శనం చేస్కోవాలి. అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు వస్తున్నాయి. సినీ పరిశ్రమ ఆంధ్రాకు పోవాలని కాంగ్రెస్ నాయకులు కోరు కుంటున్నారు. ఇండస్ట్రీ ఆంధ్రాకు తరలివెళ్తే తెలంగాణకే నష్టం. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడు కుండా వారి అధిష్ఠానం అదుపులో పెట్టాలని బండి సంజయ్ అన్నారు.

## ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

**పోలవరం సహా పలు అభివృద్ధి పథకాలపై చర్చ**

**బడ్జెట్‌లో ఏపికి కేటాయింపులు పెంచాలని వినతి**

**8న రైల్వేజోన్ శంకుస్థాపనకు ప్రధానికి ఆహ్వానం**



**న్యూఢిల్లీ,డిసెంబర్25:** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోడీని సీఎం కోరినట్టు తెలిసింది. గత ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పోలవరం ప్రాజెక్టు పనుల్లో పురోగతిని చంద్రబాబు వివరించినట్టు సమాచారం. దాదాపు గంటకు పైగా ప్రధానితో చంద్రబాబు సమావేశం కొనసాగింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో ఏపీ సీఎం చంద్రబాబు సమావేశంలో పలు అంశాలు చర్చించారని సమచారం. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై భేటీలో చర్చించినట్టు సమాచారం. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ అయ్యేందుకు వెళ్లారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోడీ ఏపీలో పర్యటించనున్నారు. జనవరి 8న ప్రధాని మోడీ ఏపీ పర్యటనకు రానున్నారు. రూ. 85 వేల కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిసింది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న విశాఖ రైల్వే జోన్‌కు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్టీపీసీ నిర్మించే ఏపీ జెన్కో గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. నవంబరులో జరగాల్సిన ప్రధాని పర్యటన తుఫాన్ కారణంగా వాయిదా పడడంతో శంకుస్థాపనలు నిలిచిపోయాయి. తాజాగా జనవరి 8న ప్రధాని మోడీ అనకాపల్లి జిల్లా పర్యటన ఖరారైంది. ప్రధాని పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి లోకేష్‌తో పాటు, అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ పర్యవేక్షిస్తున్నారు. శంకుస్థాపనల కార్యక్రమంలో ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం మండలంలో పూడిమడకలో ఎన్టిపిసి నిర్మించే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌తో పాటు, మరికొన్ని ప్రాజెక్టులకు ప్రధాని మోడీ శంకుస్థాపనలు చేయనున్నారు. సుమారు రూ.85 వేల కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టు ద్వారా 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. విశాఖను గ్రోత్ హబ్‌గా కేంద్రం ప్రకటించింది. ఇదిలా ఉండగా.. ఏపీ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఢిల్లీలో ప్రధాని సహా కేంద్ర మంత్రులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ప్రధాని మోడీతో సీఎం సమావేశమయ్యారు.

## సిఎంతో నేడు టాలీవుడ్ ప్రముఖుల భేటీ

**కమాండ్ కంట్రోల్ వేదికగా సమావేశం**

**చిరంజీవి తదితరులు హాజరు కాన్నున్నట్లు సమాచారం**



**హైదరాబాద్,డిసెంబర్25:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టాలీవుడ్ సినీ ప్రముఖులు సమావేశానికి అపాయింట్‌మెంట్ ఖరారు అయింది. గురువారం ఉదయం 10.00 గంటలకు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ ప్రముఖులు సమావేశం కానున్నారు. టాలీవుడ్ నుంచి మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతోపాటు పలువురు నిర్మాతలు, దర్శకులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.ఇక ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా తదితరులు ఈ సమావేశంలో పాల్గొనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా సినిమా పరిశ్రమల సమస్యలే ఎజెండాపైనే చర్చ జరగనుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కానీ అల్లు అర్జున్ ఎపిసోడ్ నేపథ్యంలో రేపటి భేటీపై తీవ్ర ఆసక్తి నెలకొంది.అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించిన పుష్ప 2 డిసెంబర్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. అయితే డిసెంబర్ 04వ తేదీ రాత్రి ఈ చిత్రాన్ని హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రీ రిలీజ్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ చిత్రాన్ని అభిమానులతో వీక్షించేందుకు హీరో అల్లు అర్జున్, హీరోయిన్ రష్మిక తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకుంది. దీంతో రేవతి అనే మహిళ చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్ చికిత్స పొందుతున్నాడు. మరోవైపు ఈ వ్యవహారంలో హీరో అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ క్రమంలో అతడిని పోలీసులు అరెస్ట్ చేసి.. జైలుకు తరలించారు. దీంతో అతడు కోర్టును ఆశ్రయించగా.. బెయిల్ మంజూరు అయింది. దీంతో అల్లు అర్జున్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీలో సైతం ఈ వ్యవహారంపై తీవ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం వ్యాఖ్యలపై హీరో అల్లు అర్జున్ స్పందించారు. నేపథ్యంలో పుష్ప 2 చిత్రం విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద చోటు చేసుకున్న పరిణామాలకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌లతోపాటు ఆ సమయంలో విధుల్లో ఉన్న పోలీసులు సైతం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇంకోవైపు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను టాలీవుడ్ పరిశ్రమకు చెందిన వారు పరామర్శిస్తున్నారు.

## క్రిస్మస్‌తో శాంతి, సౌభ్రాతృత్వం,

**తోటివారిని ప్రేమించండి.. తోటి వారికి ఉపకారం చేయండి : మాజీ మంత్రి హరీశ్‌రావు**



**సిద్దిపేట, డిసెంబర్ 25:** ఏసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ, కరుణ, శాంతి ఇతరుల పట్ల చూపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. సిద్దిపేటలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏసు క్రీస్తు జన్మించిన డిసెంబర్ మాసం వచ్చిందంటే క్రైస్తవులందరికీ సంతోషంగా ఉంటుందని అన్నారు. ఈ క్రిస్మస్ మనందరికీ శాంతిని, సౌభ్రాతృత్వాన్ని, సహనాన్ని, క్షమాగుణాన్ని నేర్పుతుందని పేర్కొన్నారు. ఎదుటివారి పట్ల జాలి, దయ, క్షమాగుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు ప్రబోధించారని హరీశ్‌రావు అన్నారు. తోటివారిని ప్రేమించండి.. తోటి వారికి ఉపకారం చేయండి.. పది మందికి సహాయం చేసినపుడే నీ జన్మ ధన్యమవుతుందని ప్రభువు చెప్పారని తెలిపారు. తనను శిలువ వేసిన వారిని, తనను నానా మాటలు అన్నవారిని కూడా క్షమించండి అన్న గొప్ప దయామయుడు ఏసు క్రీస్తు అని కొనియాడారు. అందుకే ఏసుక్రీస్తు గొప్పతనాన్ని ప్రపంచమంతా గుర్తించిందని అన్నారు. దేశంలో క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా జరిపిన ఒకే ఒక ముఖ్యమంత్రి కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. క్రిస్మస్ తెల్లవారి బాక్సింగ్ డే రోజు కూడా కేసీఆర్ సెలవుగా ప్రకటించారని గుర్తుచేశారు. బతుకమ్మ పండుగకు హిందువులు, రంజాన్ పండుగకు ముస్లింలు, క్రిస్మస్ పండుగకు క్రైస్తవులు కొత్త బట్టలతో ఉండాలని కేసీఆర్ పదేళ్లపాటు తోఫాను అందించారని తెలిపారు. కానీ, దురదృష్టవశాత్తు ఇప్పుడున్న ప్రభుత్వం ఆ తోఫాలను కొనసాగించకుండా ఆపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మీ అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరియాలని, మీ కోరికలు, కలలన్నీ నిజం కావాలని ఆకాంక్షిస్తున్నానని హరీశ్‌రావు అన్నారు. మీ భవిష్యత్తు బంగారుమయం కావాలని, ఉజ్వలంగా ఉండాలని ఆ ఏసు ప్రభువును మనసారా ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఏసు ప్రభువు చెప్పిన విషయాలన్నింటినీ మనం జీవితంలో ఆచరించాలన్నారు. అప్పుడే అపుడే ఏసు ప్రభువు పట్ల మనం నిజమైన భక్తి చూపిన వారమవుతామని పేర్కొన్నారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

**బాధిత కుటుంబానికి 2కోట్ల సాయం**

**ఆస్పత్రిలో బాలుడు శ్రీతేజ్‌కు పరామర్శ**

**చెక్కును దిల్‌రాజ్‌కు అందించిన అరవింద్**

హైదరాబాద్,డిసెంబర్25: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన ఈ మేరకు తన నిర్ణయాన్ని ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరఫున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు.

## అవినీతిరహిత పాలన అందిస్తున్న బిజెపి

**మరో రెండు పర్యాయాలు అధికారం బిజెపిదే**

**ఎంపి పురంధేశ్వరి స్పష్టీకరణ**

**రాజమండ్రి,డిసెంబర్25:** విశాఖ డెయిరీ పాలక వర్గం బీజేపీలో చేరింది. రాజమండ్రిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి సమక్షంలో డెయిరీ ఛైర్మన్ ఆడారీ ఆనంద్‌తో పాటు డైరెక్టర్లు యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి బీజేపీ కండువాలను కప్పుకున్నారు. రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి ఆడారి ఆనంద్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. వారి తండ్రితో మా నాన్నకు అవినాభావ సంబంధం ఉందన్నారు. పార్టీలోకి వచ్చిన తరువాత సిద్ధాంతం, క్రమశిక్షణ అవలంబిస్తూ వారి ప్రాంతంలో పార్టీని బలోపేతం చెయ్యడానికి కృషి చేయాలని సూచించారు. ప్రధాని మోడీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని, అలాగే దృఢ నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట అంటూ పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో కూడా బీజేపీని ప్రజలు ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. 11వ ఆర్థిక శక్తి గా ఉన్న దేశాన్ని 5వ ఆర్థిక శక్తిగా ప్రధాని మోడీ తీర్చిదిద్దారన్నారు. అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించారని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్‌కు భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ట్రైబల్ మహిళను రాష్ట్రపతి చేసిన బీజేపీ.. మహిళలను ఎంతగా గౌరవిస్తుందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలకు బీజేపీ శ్రీకారం చుట్టిందన్నారు. స్వతహాగా బీజేపీలో ప్రజలు చేరుతున్నారని.. 25 లక్షల మంది ప్రజలు పార్టీలో చేరారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి సహాయ సహకారాలు అందజేస్తున్నారన్నారు. చిటికెడు మట్టి కూడా గత ప్రభుత్వం విదల్చలేదని విమర్శించారు. రాష్ట్రానికి పన్ను రాయితీలు, అమరావతి నిర్మాణానికి నిధులు, పోలవరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. గడిచిన 5 ఏళ్లలో రాక్షస విధ్వంసకర పాలన చూశామన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కచ్చితంగా ఏపీ అభివృద్ధి పదంలో దూసుకుపోతుందన్నారు. సుపరిపాలన అందించడం వల్లే బీజేపీని వరుసగా మూడుసార్లు ప్రజలు గెలిపించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి పేర్కొన్నారు. బీజేపీని మరో రెండు మూడు సార్లు అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ బీజేపీకి స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు బీజేపీని సమర్థించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం సభలో ఎంపీ పురంధేశ్వరి మాట్లాడారు. కండువా వేసుకోవడమే కాదు.. బాధ్యతలు కూడా తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. బీజేపీ రాష్ట్రంలో బలమైన శక్తిగా రూపుదిద్దుకునే అవకాశం ఉందన్నారు.

# శ్రామిక శక్తిని క్యాష్ చేసుకుంటున్న పారిశ్రామికవేత్తలు



**న్యూఢిల్లీ :** ఏటేటా కార్మిక దినోత్స వాలు జరుపుకుంటూ,,మేడే ఉత్స వాలు నిర్వహిస్తున్నా కార్మిక రంగం మాత్రం పురోగతి సాధించడం లేదు. కార్మికుల శ్రమశక్తితో ఎదుగుతున్న వారు వారిని పట్టించుకోవడం లేదు. గతం కన్నా మిన్నగా శ్రమదోపిడీ ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కానవస్తోంది. యాంత్రికయుగం రాక ముందు మనిషి గంటలకొద్దీ పనిచేసేవాడు. అదొక బానిస బతుకు. మనిషి తన విజ్ఞాన పరిశోధనల మూలంగా యంత్రాలను సృష్టించు కున్నాడు. యాంత్రిక యుగంలో క్యాపిటలిజం ఏవిధంగా పెరిగిందో అదే స్థాయిలో సామాజిక స్పృహ, చైతన్యం కూడా పెరిగాయి. అందువల్లనే పనిగంటల పోరాటం వచ్చింది. కానీ భారతదేశంలో చికాగో కంటే ముందే, కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటివరకు ఆ రైల్వే కార్మికులు 10 గంటలు పనిచేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలకవర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పనిచేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు. 1923లో మొదటిసారి భారతదేశంలో 'మే డే'ను పాటించడం జరిగింది. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటినుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటినుండి 'మే డే'ను పాటించడం జరుగుతుంది. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ఈనాడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో విద్యావంతులైన యువత ఈనాడు శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఈనాడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవ ర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలి స్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలులో లేవు. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. ఆ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైన పీడక వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# ప్రాంతీయ పార్టీల మనుగడపై బిజెపి దెబ్బ


### ఇడి, సిబిఐ వేధింపులతో దెబ్బతీసే యత్నం

**న్యూఢిల్లీ :** ప్రాంతీయ పార్టీల నేతలను భయపటెటడం ద్వారా బిజెపి దేశంలో బలమైన రాజకీయ పార్టీగా తిరుగులేకుండా చేసుకోవడం కోసం ఎత్తులు వేస్తోంది. బిజెపి మళ్లీ అధికారం లోకి వస్తే మరింతగా వేదింపులు తప్పవన్న బయం కూడా ఉంది. దీంతో ప్రాంతీయ పార్టీలకు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్ ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన



తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రాంతీయ పార్టీల్లో అధికారంలో ఉన్న వైసీపీ రెండోసారి ఎన్నికల్లోనే సంకట పరిస్థితిలో పడింది. తెలుగుదేశంతో రాజకీయంగా పోరాడే బదులు ఎన్నికల సమయంలో కేసులు మోపడమే వైసీపీ అత్మరక్షణలో పడిందనడానికి నిదర్శనం. నిజానికి అరవింద్ కేజీవ్రాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు. గుజరాత్, గోవాలో కాంగ్రెస్ ఓట్లను చీల్చారు, తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను సిఎం పదవి వీడేలా చేసింది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల తర్వాత ఎన్ని ప్రాంతీయ పార్టీలు ఉంటాయో, ఎన్ని మిగిలిపోతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

# ప్రచారంలో..అందరూ జాదూగాళ్లే !




సిద్ధాంతాలు పక్కకు పోయాయి. సమస్యల ప్రస్తావన లేదు. ఎదుటివారిని బురిడీ కొట్టించడం.. బురదజల్లడం, ఓట్లను లాగడం వంటి విద్యల్లో రాజకీయ నేతలు ఆరితేరారు. రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారడంతో అబద్దాలు ప్రచారం చేయడం..ఫేక్ వీడియోలు విడుదల చేయడం ఎన్నికల్లో సర్వసాధారణం అయ్యింది. ఓ మూడు నెలలు కష్టపడితే ఐదేళ్లు అధికారం వెలగబెట్టవచ్చు. ప్రజలను నిత్యం మోసం చేస్తూ ఉండవచ్చు. అందినకాడికి దోచుకోవచ్చు. ఇందుకు ఎవరూ అతీతులు కారు. అంతా ఒకే తాను ముక్కలు. ఇందులో ఒకరికి ఒకరు పోటీ పడుతున్న తీరు భారత ప్రజాస్వామ్యంలో వేళ్లూనుకుపోయింది. ప్రజలు పేదలుగా ఉండిపోవాలి. అడుక్కుతినే స్థితి నుంచి దాటి రావద్దు. ఉచిత బియ్యం, పెన్షన్లు, ఇళ్ల పందేరం, డబ్బుల పందేరం వంటివి చూపి ఓట్లు కొల్లగొట్టడం అలవాటు చేసుకున్నారు. దేశంలో కీలకమైన సమస్యలను పరిష్కరించే సత్తా నేతల్లో కానరావడం లేదు. సాగు,తాగునీటి సమస్యలను పరిష్కరించే ఉపాయాలు నేతల్లో లేవు. వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లవచ్చో..అన్న లోచనలు అస్సలు లేవు. పన్నులు పెంచడం, పందేరం చేయడంలో నేతలు పోటీ పడుతున్నారు. దీనికోసం మనమంతా ఓట్లు వేస్తున్నామని గుర్తించడం లేదు. ఎన్నికలలో ప్రజలను నమ్మించేందుకు అన్ని పార్టీలు కూడా మితిమీరిన వాగ్దానాలు చేయటం చూస్తున్నాం. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. పరస్పర ఆరోపణలు చేసుకోవటం హద్దులు దాటింది. కొత్తగా వీడియోలు మార్ఫింగ్ చేయడం..చెప్పని డైలాగులు చొప్పించడం వంటివి కూడా చేస్తూ ఎదుటి వారిని ప్రజల్లో బద్నాం చేయడంలో నిష్ణాతులు అవుతున్నారు. ఈసారి చూస్తున్నంతగా అబద్దాలు, పరస్పర దూషణలు గతంలో ఎన్నడూ లేవు. తిట్టుకోవడంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారు. సభ్య సమాజం ఒకటి ఉందన్న విషయం మరిచిపోయారు. సోషల్ మీడియా ముఖ్యంగా టీవీలు, యూట్యూబుల్లో ఈ పైత్యం పెరిగింది. రాజకీయ పార్టీల మధ్య పోటీ అన్నది పోయి..వ్యక్తుల మధ్య దూషణల పోటీలాగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. మేనిఫెస్టోలను ప్రకటించినపుడు అలవిగాని హామీలు అన్నీ ఇందులో చోటు చేసుకుంటున్నాయి. కలిపి నోట్లో ముద్ద పెట్టడమే తరువాయి అన్నచందంగా హామీల జాబితా తయారయ్యింది. ఇక విషయం ఏదైనా ప్రజల వద్దకు వెళ్లి విషప్రచారాలు చేసుకోవడంలో నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, చివరకు ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతగా పతనం అయ్యిందో తాజా ఎన్నికల ప్రచారం చూస్తే తెలుస్తుంది. తమ పాలనా కాలంలో చేసిన మంచిపట్ల ప్రజలకు విశ్వాసం కల్పించలేక పోతున్నారు. అందుకు కారణం.. సమస్యలను పరిష్కరించే సత్తా ప్రదర్శించలేక పోవడమే. అయినప్పటికీ అధికారం కోసం నానా గడ్డీ కరుస్తున్నారు. ప్రజలను మరోమారు వంచించాలంటే అబద్దాలే అవసరం అని గుర్తిస్తున్నారు. అబద్దాలతో, ప్రత్యర్థులపైన ఆరోపణలతో ఏదో ఒక విధంగా మెప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. తమ వైఫల్యాలను, బలహీనతలను ప్రజల దృష్టిలో మరుగునపడేట్లు చేయడం కోసం ఎదుటి పక్షంపై ఎంతకైనా తెగిస్తున్నారు. బురదజల్లుతున్నారు. ఇలా ప్రజల దృష్టిని పక్క దారి పట్టించేందుకు అవసరమైన టక్కుటమార, గజకర్ణ,గోకర్ణ విద్యలన్నీ ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, దూషణలతో హంగామా సృష్టించడంలో రాటుదేలారు. ఇలాంటి ప్రచారాలతో వ్యక్తులు స్థాయి, సంస్కృతి, సంస్కారం, నాగరికత, ప్రజాస్వామిక విలువలు పతనమవుతుండటం చూస్తున్నాం. అధికారం ద్వారా సంపదను పోగుచేసుకోవడం లక్ష్యంగా రాజకీయం సాగడం వల్ల అధికారం కోసం ఇలా నానాగడ్డీ కరుస్తున్నారు. మనకు స్వాతంత్రం లభించినప్పటి నుంచి పాలించిన పార్టీలు గాని, తర్వాత ఉనికిలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, కులపార్టీలు, వేర్వేరు సిద్దాంతాల పార్టీల గాని క్రమంగా తమ పరిపాలనలో విఫలమవుతూ వచ్చాయి. సిద్దాంతాలకు దూరమవుతూ వచ్చాయి. ఆర్థిక సంస్కరణలు వ్యక్తులు, నాయకులు, పార్టీలు సంస్థల ప్రాపంచిక దృక్పథాన్ని గణనీయంగా ప్రభావితం చేయసాగింది. అధికారంలో ఉంటే సుఖాలు అనుభవించవచ్చు. అప్పనంగా సంపాదించవచ్చు. అన్న ఏకైక లక్ష్యం కోసం రాజకీయ పార్టీలు ప్రజలను సమిధలుగా చేస్తున్న తీరు ప్రతి ఎన్నికల్లోనూ చూస్తున్నాం. ప్రజలు మంచి అనుకున్న వారిని నమ్మి గద్దెనెక్కించినా వారు కూడా అలాగే తయరావుతున్నారు. తెలంగాణలో ఉద్యమం చ ఏసిన పార్టీనే గద్దెనెక్కిస్తే ఎంతగా భ్రష్టుపట్టించిందో చూశాం. ఎపిలో అయితే బటన్ నొక్కుడే అభివృద్ధి అని కొత్త తరహా రాజకీయం నెరిపారు. ఇలా ఎవరిని నమ్మాలి. కేంద్రంలో మోడీని నమ్మితే ఆదానీ, అంబానీలు రాజ్యమేలుతున్నారు. ప్రజల నడ్డి విరిచేలా పన్నులు వేస్తూ..బతకడం అన్నది భారంగా చేశారు. అంతకు ముందు పదేళ్ల కాంగ్రెస్ పాలనలో అవినీతి ఊడలు విశ్వవ్యాప్తం అయ్యాయి. అయినా ఇవే పార్టీలు మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నాయి.దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా నేటికీ ఇదే దుస్తితి కొనసాగుతున్నది. చివరకు వామపక్షాల ఏలుబడిలో వరుసగా 34 సంవత్సరాలు బెంగాల్ ఎలా తయారయ్యిందో చూశాం. అందరూ రాజకీయాధికార సాధన, ధన సంపాదనలనే ఏకైక ధ్యేయంగా మార్చి, అబద్దాలు, ఆరోపణలు దూషణలు చేసుకోవటం కారణంగానే భారత ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రతి ఎన్నికల్లో ఓడిపోతున్నారు. ఈ సువిశాల దేశంలోని అన్ని ప్రాంతాలను, అన్ని వర్గాల ప్రజలను రాజకీయ పార్టీలు బలిపశు వులను చేస్తున్నారు. ఎన్నకల ప్రచారాలు శృతిమించటం, గతంలో ఎన్నడూలేని స్థాయిలో ఆరోపణలు, దూషణలు , డబ్బులు వెదజల్లడం వంటి చర్యల కారణంగా మన వ్యవస్థ దెబ్బతింటూనే ఉంది.

## ప్రత్యేక పూజలు చేసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి సమయం తొర్రూరు డిసెంబర్25**

పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు చేసిన పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి తమ బంధుమిత్రులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఆలయ అభివృద్ధి అవసర అవసరమైన మౌలిక వసతుల కోసం తాను ప్రత్యేక శ్రద్ధ చూపుతానని హామీ ఇచ్చారు దేవాలయ ప్రాంగణం లో పునరుద్ధరణకు ప్రభుత్వ సహాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు ప్రాంత ప్రజల శ్రేయస్ కోసం ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాలలో ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆలయ కమిటీ సభ్యులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## ఎవరి కోసం పార్లమెంట్ ?

గత కొన్నేళ్లుగా పార్లమెంటులో చర్చ అన్న అంశం లేకుండా పోయింది. కేవలం రచ్చ మాత్రమే సాగు తోంది. ఇరు పక్షాలు ఇదే కోరుకుంటున్నాయన్న అనుమానాలు కలుగుతున్నాయి. చర్చచేస్తే డొల్లతనం బయట పడుతుందేమో అన్న భయం అధికారపక్షానికి ఉండివుంటుంది. చర్చలో పసలేకుంటే ఎలా అన్న భయం విపక్షాల్లో ఉన్నట్లుగా ఉంది. అందుకు ఇరుపక్షాలు చర్చకు దూరంగా ఉంటున్నాయి. ఫలానా సెక్షన్ కిందే చర్చించాలని పప్రతిక్షం పట్టు పడుతుంటే..కాదుకాదు..ఫలాన సెక్షన్ కిందే చర్చిస్తామని అధికారపక్షం చెబుతోంది. మొత్తంగా మండుతున్న మణిపూర్ వ్యవహారం పార్లమెంటులో మాత్రం అంటుకోవడం లేదు. ఎందుకంటే చర్చజరిగితే ఏదైనా నిగ్గ తేలేది. సమస్యపై చర్చించడం ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయా లన్న పట్టుదల విపక్షాల్లో కానరావడం లేదు. అంతుకు మించి.. రాజకీయంగా లబ్ధిపోందాలన్న ఆకాంక్షలో విపక్ష సభ్యులు ఉన్నారు. దాదాపు వారం రోజులు కావస్తున్నా..ఆందోళనల వరదలో సమస్యలు కొట్టుకుపోయా యి. అందులో మణిపూర్ ఘటన కూడా ఉంది. గత పార్లమెంట్, శీతాకా సమావేశాలను తీసుకుంటే ఇలాగే సాగింది. విపక్షం పట్టుబట్టడం..అధికార పక్షం తోసిపుచ్చడం అన్న ఆనవాయితీ కొనసాగుతోంది. ఎన్నాళ్లిలా పార్లమెంట్ సమయాన్ని వృధా చేస్తారా అన్నది చూడాలి. బలహీనమైన విపక్షం అన్న కారణంగా అధికార పక్షం తలొగ్గడం లేదు. ఈ పద్దతి కాదులే అని మోదీ సర్కారుపై విశ్వాసపరీక్షకు విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ రకంగా అయినా చర్చించాలన్న ఉద్దేశ్యం ఉంటే మంచిదే. అలా కాకుండా ఏదో సర్కార్‌ను ఇరుకున పెట్టాలన్న దురుద్దేశ్యం ఉంటే ప్రజలు మాత్రం క్షమించరు. పార్లమెంటును ఉపయోగించుకోలేని విపక్షం అని ఇప్పటికే చర్చ జరుగుతోంది. మొత్తంగా విపక్షాల నోటీసులకు స్పందించిన స్పీకర్ ఓంబిర్లా...పార్టీలతో చర్చించి తేదీని ప్రకటిస్తానన్నారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంటు ముందు ఉంచి చర్చించి, సర్కార్‌ను నిలదీయడంలో ఇప్పటికే విపక్షాలు విఫలం అయ్యాయి. మణిపూర్ సంక్షోభంపై మాట మాట్లాడని మోదీ ప్రభుత్వంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి కానీ ఏకాభిప్రాయం సాధిస్తాయా అన్నది చూడాలి. మోదీ ప్రభుత్వంపై ఇది రెండో అవిశ్వాస తీర్మానం కావడం గమనార్హం. మొత్తంగా ఆత్మవిశ్వాసంతో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అవిశ్వాస తీర్మానం ఎదుర్కోనున్నది. రూల్ 198 కింద కాంగ్రెస్ లోక్‌సభాపక్ష ఉప నేత, ఎంపీ గౌరవ్ గొగోయ్ తీర్మానం ప్రవేశపెట్టగా నిబంధనల ప్రకారం 50 మందికి పైగా సభ్యులు మద్దతు తెలిపారు. దీనిపై 10 రోజుల్లోగా చర్చించాల్సి ఉంటుంది. మణిపూర్ అ÷-లలర్లపై ప్రధాని మోదీ నోరు మెదపడం లేదన్న సాకుతలో విపక్షాలు అవిశ్వాస తీర్మాన అస్త్రాన్ని ప్రయోగించాయి. ఈ విధంగానైనా సభలో ప్రభుత్వ తీరును ఎండగట్టే అవకాశం వస్తుందన్న వ్యూహంతో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఉంటాయి. ఓవైపు మణిపూర్ లో హింసాకాండ, మహిళలపై అఘాయి త్యాలు చోటుచేసుకుంటుంటే.. ప్రధాని మోదీ మౌనంగా ఉండ టాన్ని ప్రతిపక్ష నేతలు తప్పుబడుతున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై దాదాపు వారం కావస్తున్నా మణిపూర్‌తో పాటు ఇతర సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రాకుండా, ఉభయ సభలను వాయిదాల పర్వంలో నడిపిస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని పార్లమెంట్ వేదికగా ఎండగట్టేందుకు విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం ఎదుర్కోవడం ఇది రెండోసారి. 2018, జూలై 20న ప్రతిపక్షాలు మొదటిసారి అవిశ్వాసం పెట్టాయి. అయితే లోక్‌సభలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ ఉండటంతో అది వీగిపోయింది. ప్రస్తుతం 543 మంది సభ్యులు గల లోక్‌సభలో ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 330 మంది ఎంపీలు ఉన్నారు. కాంగ్రెస్‌తో కూడిన విపక్ష కూటమికి 140 మంది ఎంపీల మద్దతు ఉన్నది. ఈ రెండు గ్రూపుల్లో లేని ఇతర పార్టీలకు 60 మంది ఎంపీలు ఉన్నారు. దేశ చరిత్రలో కేంద్ర ప్రభుత్వంపై 27 సార్లు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టారు.

# రాజకీయాలకు వన్నెతెచ్చిన వాజ్‌పాయ్

## పోలాడి రామారావు

**తొలి సమయం కరీంనగర్, డిసెంబర్, 25:** రాజకీయాలలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక నాయకుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ అని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు.బుధవారం ఇక్కడ ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన భారత రత్న వాజ్ పాయ్ శతజయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పార్లమెంటులో ఒక్క ఓటు తేడాతో ప్రధాని పదవి వదులుకొని నైతిక విలువలకు మించింది లేదని ఆయన నిరూపించారని చెప్పారు.రాజనీతికి నిలువుటద్దం, రాజీ ఎరుగని దేశభక్తుడు, నిజాయితీ, నిబద్ధతో అజాత శత్రువుగా, స్టేట్స్ మెన్ గా,పార్టీలకతీతంగా కమ్యూనిస్టులతో సహా వాజపేయి ని ఆదర్శ రాజకీయ నాయకుడిగా కొనియాడే వారని, భారత జాతి గర్వించదగ్గ మహా నేత రాజకీయ భీష్మ పితామహుడు,అటల్ బిహారీ వాజపేయి అని, ప్రతిపక్ష నేతగా, ప్రధానిగా, అత్యున్నత విలువలను ఆయన రాజకీయాలలో పాదుకొల్పారని రామారావు చెప్పారు. పది సార్లు లోక్ సభ సభ్యునిగా, రెండు సార్లు రాజ్య సభ సభ్యునిగా ఉన్న వాజపేయి నేడు ఒక రాజకీయ విశ్వవిద్యాలయం అని,రహదారుల అనుసంధానం వల్లనే గ్రామీణ అభివృద్ధి సాధ్యమని భావించి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పేరుతో ప్రతి ఊరుకు రోడ్లు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వాజపేయి దూర దృష్టి వల్లే నేడు మనం ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ, అభివృద్ధి పథంలో దూసుకు వెళ్లగలుగుతున్నామని కొనియాడారు. టెలికాం, టీవీ, ఇంటర్నెట్,విద్యుత్, గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు, పోర్టులు, నేషనల్ హైవేస్, వ్యవసాయ, ఐటీ పారిశ్రామిక , విద్య,వైద్య రంగాల్లో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి ఆయన వేసిన బాటలే కారణం అన్నారు. శత్రుదేశాలను సైతం మిత్ర దేశాలుగా మలుచుకున్న వాజ్ పాయ్ ని దేశ యువత ఆదర్శంగా తీసుకోవాలని అదే మనం వాజపేయికి ఇచ్చిన ఘన నివాళి అని, నేటి యువతరం ఆయన నుంచి



నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని పోలాడి రామారావు అన్నారు.

# విగ్రహాల రాజకీయ వలలు!

## రంగనాయకమ్మ

'తెలంగాణా తల్లి' విగ్రహం మీద,అధికార పార్టీ వారూ%-% ప్రతిపక్ష పార్టీల వారూ చేస్తున్న ఆర్భాట కార్యక్రమాలు ఇన్నీ అన్నీ కావు. 'తెలంగాణా తల్లికి, మా పార్టీయే ముద్దు బిడ్డ!' అని ఒకరంటే, 'మీ పార్టీ కాదు, మా పార్టీయే!' అని మరొకరూ! ప్రకటనలూ, పాలాభిషేకాలూ, భారీ బహిరంగ సభలూ! 'మా విగ్రహం తెలంగాణా ఆత్మగౌరవానికీ, అస్తిత్వానికీ ప్రతీక' అని ఒక పార్టీ అంటే, 'మీ విగ్రహం తెలంగాణా ఆత్మగౌరవం మీదా, అస్తిత్వం మీదా, దాడి' అని ఇంకో పార్టీ! రెండు పార్టీల వారూ, 'తెలంగాణా తల్లి బిడ్డల'మనే చెప్పుకుంటారు.ఆ బిడ్డల్లో ఒక పార్టీ వారు, 'మా విగ్రహంలో రాజసం ఉట్టిపడుతూ వుంటే, మీ విగ్రహం తెలంగాణా తల్లిని దీనాతి దీనం చేస్తోంది' అని అంటూవుంటే, ఇంకో పార్టీ వారు, 'కాదు, మీ విగ్రహం పరలోక దేవతా విగ్రహం అయితే, మా విగ్రహం బహుజన కన్న తల్లి!' అని అంటున్నారు! ఈ రకంగా, పార్టీలవారి వాద వివాదాలు!

రెండు పార్టీలూ, తెలంగాణా ప్రాంతపు బిడ్డలే! అయినా ఇరు పక్షాల వారికీ, వారి తల్లి రూపురేఖలు వేరు వేరుగా అయిపోయాయి! కారణం, అవి రాజకీయ పార్టీలు! ఎలాంటి రాజకీయాలు? లాభాల్ని దండుకునే, 'శ్రమ దోపిడీ'ని సమర్థించే, పెట్టుబడిదారీ వర్గ రాజకీయాలు!

మరో చిత్రం,ఇటు తెలంగాణాకీ,అటు ఆంధ్రాకీ ఒకే భాష! అది తెలుగు! ఆంధ్రా వాళ్ళు, 'మా తెలుగుతల్లికీ మల్లెపూదండా!' అంటారు. అక్కడ ఆంధ్రా వారికి, 'తెలుగు భాషే' తల్లి! ఇటు,తెలంగాణా వారు, 'జయ జయహే తెలంగాణ జననీ' అంటారు! ఇక్కడ, భాష పేరు కాదు, ప్రాంతం పేరు! ఆంధ్రా తల్లికి ఇప్పటికీ ఒక రూపమే. తెలంగాణా తల్లికి ఇప్పుడు రెండు రూపాలు! మొత్తం మీద ఒకే 'తెలుగు తల్లి'కి మూడు రూపాలు!

విగ్రహాల రాజకీయాల్ని చూస్తోంటే, చలం, 'హంకో మొహబ్బత్' అనే కథలో రాసిన మాటలు కొన్ని అస్పష్టంగా గుర్తొచ్చాయి. ఆ పుస్తకం తీసి ఒకసారి చూశాను.

"భరత మాత! తెలుగు తల్లి! పాకిస్తాన్ మాత! ఎక్కడుంది భారత మాత! రష్యా పిత! అమెరికా అత్త! చైనా తాత! పెరూ మరదలు! ఏనాటికైనా నవ్వకోరా జనం, మట్టిని పట్టుకుని గంతులేసిన కాలాన్ని చూసి! ఈ పద్యాలకూ, మాటలకూ ఏం గానీ, ఆ మట్టిని చూసి నీకు తల్లిలా అనిపించిందా?"... "లేవరా ఆంధ్రుడా! పడుకోవే ఆంధ్రీ! అనుకుంటో!" "మరి, తెలుగు జాతి?" "జాతి! జాతి! ఏం, మనుషులైనాక ఏదో ఒక భాష వుండదూ? ఎక్కడో ఓ చోట పుట్టరూ? ఏదో ఓ తిండి తినరూ? ఏదో మాతట!... ఏమిటా లేవరా ఆంధ్రుడా? ఎవరి మీదకిరా లేవడం? లేవమను, పక్కలు విరగ తంతారు. ఎవరి మీదకోయీ?" చలం నించీ కొన్ని మాటలే తీశాను.భాషా సంకుచిత తత్వాన్నీ,ప్రాంతీయ దురభిమానాన్నీ, జాతీయ దురహంకారాన్నీ, గొప్ప వ్యంగ్యంతో వర్ణించాడాయన!

ఇది, విగ్రహాల గురించి కాబట్టి,కొన్ని విషయాలు తెలుసుకోవాలి.ఒక ఫలానా మనిషి ప్రతి రూపాన్ని, ఒక చిత్రంగా గానీ, శిల్పంగా గానీ, విగ్రహంగా గానీ, మలిచే కళ, వేలాది సంవత్సరాల నించీ జరుగుతున్న కళే! ఆ ప్రయత్నంలో, ఆ మనిషి రూపం ఎలా ఏర్పడినా, అది, ఫలానా మనిషి కోసం ఏర్పడేదే! ఆ మనిషి నిజం మనిషి కావచ్చు, మనం చూడని మనిషి కావచ్చు.ఊహల్లోనో, సాహిత్యంలోనో చిత్రించిన ఫలానా మనిషి కావచ్చు! అయితే, 'తెలంగాణా తల్లి'గా తయారైన విగ్రహం, తెలంగాణాలో ఏ తల్లిది? తెలంగాణాలోనే కాదు,ఏ ప్రాంతంలో అయినా, సంపన్న తల్లులూ, నిరుపేద తల్లులూ, వుంటారు. వారిలో కూడా వేరు వేరు స్థాయిలు! ఆ నిజమైన స్థాయిల్లో, ఏ స్థాయి స్త్రీ రూపం 'తెలంగాణా తల్లి రూపం' అవుతుంది?

తల్లుల స్థాయిలు వేరు వేరై వుండగా,వారిలో ఏ తల్లి రూపం తెలంగాణా తల్లిగా అవుతుంది? ఒక విగ్రహాన్ని తయారుచేసి, ఇది 'తెలంగాణా తల్లి' అనడం సాధ్యమేనా? సాధ్యం కాదు. వేరు వేరు స్థాయిల స్త్రీలని, ఒకే స్థాయిలోకి మార్చడం అసత్యం! 'ఫలానా మనిషి' కోసం అయితే తప్ప, ఇతర అవసరాల అర్థంతో, ఏ కళా రూపమూ నడవదు. నడకే లేని చోట,చిత్రాలూ, శిల్పాలూ, విగ్రహాలూ, సత్యాల్ని మాయం చేస్తాయి! ఈ కారణంతో, 'తెలంగాణా తల్లి' అయినా, 'ఆంధ్ర మాత' అయినా, అసత్యం!

ఈ 'తెలుగు తల్లి' బిడ్డలు– తెలంగాణా వాళ్ళు గానీ, ఆంధ్రా వాళ్ళు గానీ,మాట్లాడే మాటలకి అర్థాలేమిటి? 'అస్తిత్వం' అంటారు! 'ఆత్మగౌరవం' అంటారు! 'అస్తిత్వం' అనే మాటకి 'ఉనికి' అనీ, 'గుర్తింపు' అనీ అర్థాలున్నాయి. భాషాపరంగా అయితే, 'తెలుగు వాళ్ళూ–తమిళ వాళ్ళూ'! అవే తేడాలే! ప్రాంతాలుగా అయితే, 'ఆంధ్రా వాళ్ళూ'–'తెలంగాణా వాళ్ళూ'! దేశాలుగా, 'భారతీయులూ' 'పాకిస్తానీయులూ'! 'కులాలు'గా చూస్తే, 'కింది కులాలూ'–'పై కులాలూ'! ఇలా! ఈ అస్తిత్వ భావనలన్నీ చాలా సంకుచితమైనవి. ఎందుకంటే, ఇవి 'శ్రమ దోపిడీ', 'అసమాన శ్రమ విభజన' అనే వాస్తవాల్ని,మరుగు పరుస్తాయి.ఈ వాస్తవ,మూల కారణాల వల్లనే, ప్రాంతీయ అసమానతలూ,కుల భేదాలూ, స్త్రీ–పురుష అసమానత్వమూ పుట్టుకొచ్చాయని గ్రహించడానికి, అస్తిత్వ భావనలు ఆటంకమవుతాయి.ఇప్పుడు జరుగుతున్న విగ్రహాల రాజకీయాల సందర్భాన్నే చూద్దాం. తెలంగాణా తల్లి పిల్లలందరూ ఒకే స్థితిలో వున్నారా? అనేకులు శ్రమ చేసే వారిగానూ, అతి కొద్ది మంది ఏ శ్రమలూ చేయని వారిగానూ లేరూ? అనేక మంది జీతాల మీదా, కొద్దిమంది లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ వంటి శ్రమ దోపిడీ ఆదాయాలమీదా బతికేవారుగానూ లేరూ? తెలంగాణా కోసం పోరాడామని చెప్పుకునే పార్టీ నాయకుల్ని గానీ,తెలంగాణాని ఇచ్చామని చెప్పుకునే పార్టీ నాయకుల్ని గానీ, సర్వే చేసి చూడండి! వీళ్ళ ఆస్తులూ, అంతస్తులూ, ఆదాయ మార్గాలూ,అన్నీ ఎలాంటివో తెలుస్తాయి! 'తెలంగాణా తల్లి' బిడ్డలైనా,'ఆంధ్ర మాత' బిడ్డలైనా, 'ఉత్కల (ఒరిసా) జనని' బిడ్డలైనా, 'కన్నడ రాజ్యమాత' సంతానమైనా, 'తమిళ తాయి' పిల్లలైనా, 'మరాఠీ ఆయీ' పిల్లలైనా, ఒకే అస్తిత్వంతో లేరు. ఏ దేశాన్ని తీసుకున్నా, ఏ ప్రాంతాన్ని తీసుకున్నా, ఏ కులాన్ని తీసుకున్నా, జనాభాలో అసంఖ్యాకులు ఏదో ఒక రకమైన శ్రమ చేసుకుంటూ బ్రతికే వారే! అల్ప సంఖ్యాకులు మాత్రమే సిరిసంపదలతో తులతూగేవారు! కంటికి కనిపించినా, వాస్తవాల్ని అర్థం చేసుకోలేని, వర్గ చైతన్యం లేని జనాలను,'జయ జయహే తెలంగాణ జననీ!', 'జై ఆంధ్ర మాతా!', 'బంగారు తెలంగాణా!', 'స్వర్ణాంధ్రప్రదేశ్!' వంటి నినాదాలతో, నిద్రపుచ్చి, వారిని శ్రమ దోపిడీకి అప్పజెప్పడమే కదా! అస్తిత్వవాదులు చెయ్యగలిగే ఘనకార్యం! ఈ ఘన కార్యాలకోసమే,వేల లీటర్ల పాలాభిషేకాలూ, బహిరంగ సభలూ!ఈ అస్తిత్వవాదులు, విరివిగా వాడే ఇంకో మాట, 'ఆత్మగౌరవం'! బతుకుతెరువు కోసం అవసరమైన శ్రమ సాధనాలు లేని అసంఖ్యాక శ్రామిక జనాలు,ఆ సాధనాల్ని స్వంత ఆస్తిగా గల యజమానుల కింద జీతాల బానిసత్వంలో జీవిస్తూ వుంటే, అది ఆత్మగౌరవం అవుతుందా?

'పై కులాలూ' %–% 'కింది కులాలూ'గా చీలివున్న సమాజంలో,ఆత్మగౌరవంతో ఎవరు ఉండగలరు? ఇంటిపని ప్రధానంగా స్త్రీలకీ, బైటిపని ప్రధానంగా పురుషులకీ అనే అసమాన శ్రమ విభజన వున్న కుటుంబ జీవితాల్లో, స్త్రీలు ఎలాంటి ఆత్మగౌరవంతో వుండగలరు?

ఇప్పుడు జరగవలిసిందేమిటంటే, అస్తిత్వం పేరుతో, ఆత్మగౌరవం పేరుతో, నడిచే విగ్రహాల రాజకీయాలకి దూరంగా వుండాలి! 'శ్రమ దోపిడీ' వ్యతిరేకమైన చైతన్యాన్నీ, సమానత్వం గురించిన అవగాహననీ నేర్చుకోవాలి!

**ఆంధ్రజ్యోతి దినపత్రిక నుండి సేకరణ**

# ఘనంగా మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పాయ్ జయంతి వేడుకలు

**తొలి సమయం తొర్రూరు డిసెంబర్ 25**

పెద్ద వంగర మండలం చిట్యాల గ్రామంలో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పాయ్ 100వ జయంతి వేడుకలు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి నాయకులు ఏర్పాటుచేసిన వాజ్ పాయ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఉద్దేశంతో సుజల యోజన ను పథకాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుధాకర్ ఉపాధ్యక్షులు దేశెట్టి వెంకటనారాయణ నాయకులు యాకయ్య, రమేష్, శంకర్ శ్రీను పాల్గొన్నారు.



## వందమంది నిరుపేదలకు దుప్పట్లు పంపణీ

### పెద్దమనుసు చాటుకున్న జబర్దస్ట్ రాజమౌళి



**తొలి సమయం, మహబూబాబాద్ డిసెంబర్ 25:** ఏసు క్రిస్తు పుట్టిన సందర్భంగా సీని కళాకారుడు జబర్దస్ట్? రాజమౌళి బుధవారం నిరుపేదలైన వంద మందికి దుప్పట్లు పంపిణీ చేసి పెద్దమనసు చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ప్రపంచనికి శాంతి మార్గన్ని భోధించిన ఏసుప్రభు మానవళికి దిక్సిచి అన్నారు. కళాకారుడిగా అందర్నీ నవ్వించే నేను సమాజంలో పెదప్రజలకు కూడా నవ్వుతూ ఆనందంగా ఉండాలని అన్నారు. మనం చేసే ప్రతి పనుల్లోనూ సహాయంలోనూ దైవత్వం చూడాలన్నారు. మనం ఎంత ఎదిగిన సమాజానికి చేసే సేవే ఉన్నతస్థానానికి నిలబెడుతుందన్నారు. స్థానిక రైల్వే స్టేషన్?, శ్రీనివాసా సెంటర్?, బస్టాండ్?, నెహ్రుసెంటర్?లలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సీనియర్? జర్నలిస్టు గుండెల రాజు, శంతన్ ?రామరాజులు మాట్లాడుతూ ఆయన చేస్తున్న సేవలు సామాజానికి స్పూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజమౌళి సతీమని సావిత్ర, భానుశ్రీ, రాఘవేంద్ర, పద్మ, కొమిరె వెంకన్న, బండ వెంకన్న తదితరులు ఉన్నారు.

## వార్షిక తనిఖీ నిర్వహించిన తొర్రూరు డి.ఎస్.పి కే కృష్ణ కిషోర్

### పెద్ద వంగర పోలీస్ స్టేషన్ తనిఖీ

**తొలి సమయం పెద్ద వంగర డిసెంబర్25**




ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకము గా మెలగాలి పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రుర్ సీఐ జగదీష్, పెద్దవంగర ఎస్.ఐ క్రాంతి కిరణ్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### పలు మృతుల దేహాల అంతిమ సంస్కారంలో సీనియర్

## కాంగ్రెస్ నాయకులు రాయపురం సాంబయ్య

**తొలి సమయం వర్ధన్నపేట డిసెంబర్ 25:**



వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశం మేరకు నియోజ కవర్గంలోని మృతుల అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు మరి యు కుటుంబాలను రాయపురం సాంబయ్య పరామర్శించారు పున్నేలు గ్రామానికి చెందిన జిల్లా సమ్మయ్య జిల్లా గోపి ప్రమాదానికి గురై మృతి చెందారు అదేవిధంగా వడ్డెర గూడెంకు చెందిన ఓర్సు రాజకుమార్ నాయనమ్మ ఓర్సు ఎల్లమ్మ అనారోగ్యంతో మరణించింది ఈ రెండు మృతుల అంతిమ సంస్కారంలో రాయపురం సాంబయ్య పాల్గొని ఆ కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సమ్మెట మహేష్ గౌడ్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నరక కంటి మోహన్ గౌడ్ ఎక్స్ ఎన్ పి టి సి ఎండి భాష మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇల్లందు ఎలీషా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి సుధీర్ ఎక్స్ కోఆప్షన్ సభ్యులు ఎస్కే ఉస్మాన్ చాట్ల సదానందం గ్రామ పార్టీ అధ్యక్షులు ఇల్లందు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని వాజపేయి జన్మదిన వేడుకలు



**తొలి సమయం దంతాలపల్లి డిసెంబర్25**

దంతాలపల్లి మండల కేంద్రంలో బిజెపి మాజీ భారత ప్రధాని డాక్టర్ అటల్ బీహార్ వాజ్పేయి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా బిజెపి మానుకోట జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సెంట్రల్ ఫిలిం సెన్సార్ ప్యానెల్ బోర్డు మెంబరు చీకటి మహేష్ గౌడ్ మాట్లాడుతూ వాజ్ పాయి ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. ఆయన జీవితం దేశానికి అంకితం అని, ఒక మచ్చ లేని రాజకీయ నాయకునిగా గుర్తింపు పొందాడని పేర్కొన్నారు. మూడుసార్లు ప్రధానమంత్రిగా చేసిన ఘనత దక్కించ్చుకుని రాజకీయానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ నియోజకవర్గ కన్వీనర్ తాడ పూర్ణచందర్ రెడ్డి రాణి రెడ్డి చిన్నాల ప్రవీణ్ కుమార్ గుండెజారి భరత్ తూర్పాటి శేఖర్ ఇల్లు దిలీప్ రెడ్డి నాగిరెడ్డి అనిల్ బండి నరేష్ అల్లం సాయి అయినాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అఖిలపక్షంతో చర్చలు ఎల్లవేళలా అవసరమే!

**తొలి సమయం హైదరాబాద్,**
రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ తెలంగాణ ప్రభుత్వంపనితీరును పరిశీలిస్తే.. ప్రజా స్వామ్యయుతంగా ముందుకు సాగుతున్నదనే చెప్పాలి. కలిసి చర్చించిడం, ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. తాజాగా తెలంగాణ గీతాన్ని ఆమోదించే క్రమంలోనూ అఖిల పక్షాన్ని పిలిచి, వారితో చర్చించి, వారు ఆమోదించిన తరవాత గీతాన్ని ఆమోదించారు. తెలంగాన అవతరణ దినోత్సవాన జూన్ 2న దీని ఆవిష్కరణ జరుగనుంది.ఇలాంటి నిర్ణయాలు మంచి సంప్రాదాయన్ని తెలియ చేస్తాయి. తెలంగాణ ఏర్పడ్డ తొమ్మిదన్నరేళ్ల కెసిఆర్ పాలనలో అఖిలపక్షాలు లేవు. సంప్రదింపులు లేవు. చర్చలు లేవు. ఏదైనా ఏకపక్ష నిర్ణయాలు... ఫామ్‌హౌజ్ చర్చలు అన్నచందంగా మారింది. ప్రజాస్వా మ్యాన్ని పాతరేసిన కల్వకుంట్ల వారు ఇప్పుడు ప్రజల గురించి మాట్లాడడం ప్రజలు కూడా జీర్ణించుకోలేక పోతున్నారు. అయితే ఎన్నికలు జరగడం.. ఫలితాల్లో ఓ పార్టీ అధికారంలోకి రావడం తో మిగతా ఎన్నికైన వారిని పాలనకు దూరంగా పెట్టడం సరికాదు. వారు కూడా ప్రజలు ఎన్నుకుంటేనే ఎమ్మెల్యేలు, ఎంపిలుగా ఎన్నికయ్యారు. కాబట్టి ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని చర్చించాలి. ప్రజలకు తెలియచేయాలి. ఏకపక్ష నిర్ణయాలు సరికాదని గుర్తించాలి. సిఎం రేవంత్ రెడ్డి కూడా మున్ముందు మరింత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్ణయాలు తీసుకుని ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టాలి. దశాబ్ది ఉత్సవాల వేళ అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించడం, అఖిలపక్షంలో చర్చించడం ఆహ్వానించదగ్గ నిర్ణయం. మాజీ సిఎం కెసిఆర్‌ను కూడా ఉత్సవాలకు ఆహ్వానించడం రేవంత్ నాయకత్వంతో పాటు, ఆయన హుందాతనానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇక పాలనా పరంగా ఉన్న అనేకానేక సమస్యలను కూడా ప్రజా ప్రతినిధుల, క్షేత్రస్థాయి నాయకులతో చర్చించి నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు జరిగేలా చేయాలి. ఏయే అంశాలపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారో వాటిని ముందుకు చర్చించాలి. తెలంగాణ ఏర్పడ్డ తరవాత గత దశాబ్ద కాలం పరిశీలిస్తే సిఎం కెసిఆర్ కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజలకు సంబంధం లేకుండా పాలన చేశారు. దీంతో అప్పులు చేసి తెలంగాణను అథఃపాతాళానికి నెట్టారు. దీనిపై మాట్లాడితే.. తెలంగాణ పరువు తీస్తున్నారని కెటిఆర్, హరీష్ రావులు అంటున్నారు. అప్పులు చేసినట్లు చెబితే తప్పెలా అవుతుందో చెప్పాలి. ప్రధానంగా సాగునీటి రంగంలోనూ, విద్యుత్ రంగంలోనూ కీలక నిర్ణయాలు తీసుకు న్నట్లు చెప్పి, ఆయా రంగాల్లో పెద్ద ఎత్తున అప్పులను చేశారు. ఆర్థిక పరమైన నిర్ణయాల్లో విచ్చలవిడి కారణంగా రాష్ట్రంలో మరిన్ని సమస్యలకు దారితీసింది. ఇప్పుడు అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ సమస్యలపై రేవంత్ ప్రత్యేక దృష్టి సారించాల్సి అవసరం ఉంది. ఇక రైతు రుణమాఫీ అన్నది కూడా నిరంతరాయంగా కొనసాగించడం సరికాదు. రైతులకు కావాల్సింది మాఫీలు కాదు.. పంటలు పండగానే కొనుగోలుచేసి వారు రోడ్డెక్కకుండా చేయగలగాలి. విత్తనాలు, ఎరువుల అందుబాటులో ఉంచాలి. ఏ పొలంలో ఏ పంట వేయాలన్నది క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారుల ద్వారా చెప్పించాలి. అదేపనిగా వరి వేయడం కాకుండా డిమాండ్ ఉన్న పంటలను పండించేలా..వాటిని కొనుగోలు చేస్తామన్న భరోసాను రైతులకు కలిగించాలి. మార్కెట్ యార్డులు, రైతు సంఘాలను బలోపేతం చేయాలి. కెసిఆర్ హయాంలో రైతుబంధు సమితి నేతలు ఏనాడూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతుల సమస్యలపై ఆరా తీయలేదు. అలాకాకుండా రైతులు ఏం కోరుకుంటున్నారో చేయగలగాలి. పత్తివిత్తనాల కోసం ఆదిలాబాద్‌లో రైతులు చేస్తున్న ధర్నాలను సీరియస్‌గా తీసుకుని అక్కడి నేతలు నేరుగా వెళ్లి పరిష్కరించే చొరవ చూపాలి. ఉత్సవ విగ్రహం లాంటి నేతలను పక్కన పెట్టాలి. అలాగే ఉచిత విద్యుత్‌పైనా నియంత్రణ ఉండాలి.వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టి విద్యుత్ వినియోగాన్ని అంచనా వేయాలి. అలాగే వ్యవసాయా నికి నిజంగానే ఎంత కరెంట్ అవసరమో అంతే ఉచితంగా ఇవ్వాలి. దుబారాకు కళ్లెం వేయకపోతే దాని ప్రభావం కూడా ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉంటుంది. ఉచిత బస్సులను కూడా తాహతును బట్టి,పేద,బడుగు మహిళలకే పరిమితం చేయాలి. జూన్ 2న అవతరణ దశాబ్ది దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ కఠిన నిర్ణయాలతో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ముందుకు సాగాలి. వివిధ రంగాల్లో గట్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా తెలంగాణ పురోగమనంలో కీలక అడుగులు వేయాలి. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే తెలంగాణ ముఖచిత్రం మార్చేలా నిర్ణయాలకు శ్రీకారం చుట్టాలి. బిఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించిన, అనుసరించిన, అవలంబించిన అన్ని విధానాలను సమీక్షించుకుని ముందుకు సాగడం అలవర్చుకోవాలి. సిఎం రేవంత్‌పై ప్రజలు విశ్వాసాన్ని ఉంచినందున.. అందుకు తగ్గట్లుగా హామీలను నెరవేర్చే బాధ్యతలను చిత్తశుద్ధితో అమలు చేయాలి. తెలంగాణ కోటి రతనాల వీణగా భాసిల్లా లంటే అందుకు కావలసిన సంకల్పబలాన్న చాటాలి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి. ఉచిత విద్యుత్ పథకం మంచిదే అయినా సమీక్షించుకుని పక్కాగా అమలు చేయాల్సి ఉంది. ఉచిత విద్యుత్‌కు విఘాతం కలిగించకుండా మీటర్లు పెట్టి విద్యుత్ వాడకాన్ని లెక్కించుకోవడం




అన్నది అకౌంటబులిటీని తెలియ చేస్తుంది. ఇదే తరహాలో తెలంగాణలో మీటర్లు పెట్టి ఏ రైతులకు ఎంత పొలం ఉంది.. వారు ఏ పంటలు వేస్తున్నారో లెక్కలు తీయాలి. ఏ పంటకు ఎంత విద్యుత్ అసవరమో అన్నది గుణించాలి. అన్నింటికి మించి పాతబస్తీలో అక్రంగా వాడుతున్న కరెంట్‌పై కన్నేయాలి. ఇలా దౌర్జన్యం చేస్తున్న వారిని పట్టుకుని కేసులు పెట్టాలి. దొంగ కరెంట్ వాడకం అన్నది నేరంగా గుర్తించి, దీనిని అరికట్టగలగాలి. లేకుంటే బిల్లులు కట్టే వారిపైనే అధిక భారం పడుతూ పోతోంది. ఇదే సందర్భంలో ఖజనాకు భారంగాను, ప్రజలకు భారంగానూ మారుతున్న పథకాలను సమీక్షించుకోవడంలో తప్పులేదు. విద్యుత్ వాడకంపై నియంత్రణ లేకుంటే ఉచిత పథకాలు మెడకు చుట్టుకుంటాయి. ఇదే సందర్భంలో దుబారాను అరికట్టకపోతే మరింత భారం తప్పదు. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాలకు వర్తిస్తుంది. దశాబ్ది ఉత్సవాల వేళ రేవంత్ సర్కార్ మంచి నిర్ణయాలతో ప్రజలకు మరింత చేరువ కావడానికి ముందుకు సాగాలని ఆశిద్దాం.

# అల్పపీడనంతో రైతుల్లో ఆందోళన

## వర్షాలతో పంట తడిసి నష్టం

**అమరావతి,డిసెంబర్25:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రజల్లో భాయాందోళనలు కలిగిస్తోంది. ముఖ్యంగా రైతులను మరింత టెన్షన్ పెడుతోంది. మూడు రోజుల నుంచి అల్ప పీడనం కారణంగా కురుస్తున్న చిరు జల్లులు నిండా ముంచేశాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంటను పడుకోబెట్టేశాయి. కొన్ని ప్రాంతాల్లో కోసిన పంట ఎందుకూ పనికి రాకుండా పోతోంది. వరి పనులు నీటిలోనే నానుతున్నాయి. వాటిని ఏం చేయాలో అర్థంకాక ఆకాశం వంక చూస్తున్నారు .రైతులు, వారం పది రోజులు విరామం ఇస్తే పంట చేతికి వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రెండు రోజుల నుంచి తేలికపాటి జల్లులు పడుతున్నాయి. రేపు ఎల్లుండి బారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ అంచనాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది పంట బాగా పండిందని మురిసిపోతున్న ఆంధ్రప్రదేశ్ అన్నదాత ఆనందంపై నీళ్లు చల్లుతున్నాయి వరుస అల్పపీడనాలు. ప్రకృతి పగబట్టిందా అన్నట్టు రైతును నట్టేట ముంచుతున్నాయి. నెల రోజుల్లోనే మూడు వాయుగుండాలు బతుకుల్లో సునామీ సృష్టిస్తున్నాయి. అటు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇటు చిత్తూరు జిల్లా వరకు అదే పరిస్థితి కనిపిస్తోంది. సంక్రాంతి నాటికి సిరుల పంటను ఇంటికి తీసుకెళ్దామని ఆనందపడుతున్న రైతులకు నిరాశ మిగిలింది. లేకుంటే మొత్తానికే పంటను వదులుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఒకట్రెండు రోజులు కాదు నెల రోజుల నుంచి ఎండ మొహం చూసింది లేదని రైతులు అంటున్నారు. ఆకాశం మేఘావృతమై ఉంటోందని దీని వల్ల పొలం పనులు ముందుకు సాగడం లేదని వాపోతున్నారు. కొందరు రైతులు ధైర్యం చేసి కోత కోసినప్పటికీ నూర్పిడి చేసే టైం వర్షాలు ఇవ్వలేదు. పంటలు కుప్ప వేసే లోపు వర్షాలు దంచి కొడుతున్నాయి. మరికొందరు ఏదైతే అది కానీ అని పొలాల్లోనే పంటను వదివలేస్తున్నారు. వరి పంట పరిస్థితి ఇలా ఉంటే పత్తి, మొక్కజొన్న, మిగతా పంటలు మరింత దారుణంగా ఉన్నాయి. కంది, శనగ పూత దశలో ఉందని ఇప్పుడు వర్షాలు పడుతున్నందున ఆ పంట చేతికి అందే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఇప్పటికే పత్తి యాభై శాతానికిపైగా ఇటీవల కురిసిన వర్షాలకు పాడైపోయిందని అంటున్నారు. తీత దశలో ఉన్న టైంలో మళ్లీ వర్షాలు అంటే పూర్తిగా ఆ పంట వదులుకోవాల్సిందేనంటున్నారు. ఇప్పటికే దెబ్బతిన్న పొగాకు ఇంకా వర్షాలు పడితే ఆకు రంగు మారిపోతుందని అంటున్నారు. కళ్లముందే పంటలు నీళ్లపాలువుతుంటే ఏం చేయలేక అల్లాడిపోతున్నారు రైతులు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో హడావిడిగా పంట నూర్పిడిలు చేసి కోత కోసి సురక్షిత ప్రాంతాలకు తరలించేస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. రైతులకు సరైన వసతులు లేకపోవడం కూడా ఆందోళన కలిగిస్తోంది. రైతులకు అండగా ఉంటామని టీడీపీ నేతలు ధైర్యం చెబుతున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పంట నీట మునిగి ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఇతర టీడీపీ నేతలు పర్యటిస్తున్నారు. పొలాల్లో తిరుగుతూ రైతులకు భరోసా ఇస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అధైర్య పడొద్దని చెబుతున్నారు. పంట నష్టపోయిన వారికి పరిహారం ఇప్పించే ప్రయత్నాలు కూడా చేస్తామని అంటున్నారు. నీటిలో తడిసిన ధాన్యం మొలకలు రాకుండా ఉండేందుకు ఉప్పు నీటిని పిచికారి చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

# అందమైన అబద్దాలతో ఎంతకామీ పాలన !

వికసిత భారత్ లక్ష్యంగా పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోందని బిజెపి శ్రేణులు పదేపదే ప్రచారం చేస్తున్నారు. గత పదేళ్లలో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవడంలో బిజెపి నేతలు విఫలంఅ వుతూనే ఉన్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారో వారికి పట్టింపు లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్నారు. నిజానికి వికసిత భారత్ లక్ష్యం అయివుంటే ద్రవ్యోల్బణం ఎందుకు దాడి చేస్తోంది. ధరలు ఎందుకు పెరుగుతున్నాయి. నిరుద్యోగం ఎందుకు తాండవిస్తోంది. వీటన్నిటికి పరిష్కారం చూపడంలో మోడీ విఫలం అయ్యారనే చెప్పాలి. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపలేక పోతున్నాం. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపోదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతున్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ద అబద్దం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పాలన జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న మోడీ.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావి అన్న విమర్శలు ఉన్నాయి. కార్పోరేట్లకే బిజెపి అనుకూలం అన్న ప్రచారం కూడా బలంగా ఉంది. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తించాలి. సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతక గలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి.

వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని మోడీ సహా నేతలంతా పేర్కొనడం చూస్తే..దేశం మరో ఐదేళ్లపాటు వేచి చూడాలన్న మాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నా మంటున్నారు. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని మోడీ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నా మని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజల ను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటికల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జివిస్టీ అన్నది ప్రజల రక్తామాంసాలను పీల్చి పిప్పి చేస్తోంది. జివిస్టీ వసూళ్లు నెలకు లక్షా 60 వేల కోట్ల వసూళ్లను చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలను జలగల్లా పీల్చి వసూలు చేస్తున్న డబ్బుగా చూడడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామంటేనే..ప్రజల కొనుగోలు శక్తి లేకుండా పోయిందని గుర్తించడం లేదు. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించడం అందంగా మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి. సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి.

## గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి

**హైదరాబాద్,డిసెంబర్25:** పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుతో తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. రికార్డులకు భద్రత లేకుండా పోయింది. భూముల లెక్కాపత్రం లేదు. జమాబందీ వల్ల భూములు, ప్రభుత్వ ఆస్తులకు లెక్క గట్టేవారు. సరిహద్దులు పక్కాగా ఉండేవి. కానీ అవన్నీ దెబ్బతిన్నా, వాటిని రక్షించే ప్రయత్నం చేయడం లేదు. కెసిఆర్ హయాంలో విఆర్‌వో వ్యవస్థ రద్దుతో ఉన్నది కూడా మాయం చేశారు. దీంతో తెలంగాణలో భూదోపిడీ కేసులు పెరిగాయి. ప్రభుత్వ, దేవాదాయ, అసైన్డ్ భూములు మాయమయ్యాయి. దీనికి సమాధానం చెప్పకుండా ధరణి పేరుతో మరింతగా దోపిడీ చేశారు. ఈ క్రమంలో మళ్లీ గ్రామీణ రెవెన్యూ వ్యవస్థకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ధరణిని రద్దు చేస్తూ భూ భారతి చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టంలో భాగంగా వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సంస్కరణల పేరిట వీఆర్ఏ, వీఆర్వో లాంటి కీలక వ్యవస్థను రద్దు చేసింది. వాటి స్థానంలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూములకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు కొనసాగించారు.

## ప్రజల జీవితాల్లో మెప్పులు పొందిన చింత సమ్మయ్య ఇక లేరు

**తొలి సమయం, వాజేడు / డిసెంబర్ 25**



ములుగు జిల్లా వాజేడు మండల ము లింగపేట గ్రామానికి చెందిన చింత సమ్మయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఏ రాజకీయ పార్టీకి వత్తాసు పడకుండా నిక్కచ్చిగా ప్రజా జీవితాల్లో ప్రజలకి 20 సంవత్సరాల కాలం నుండి మంచితనం మంచి పేరుతో మంచితనం పొందిన వ్యక్తిగా ప్రజలకు సర్పంచ్ గా సేవ చేసారు.చింత సమ్మయ్య 1987 నుంచి 2009 వరకు సర్పంచ్ గా పని చేశారు. రిజర్వేషన్లు మారడంతో తన భార్యను సర్పంచ్ గా గెలిపించారు. మళ్ళీ రిజర్వేషన్లు మారడంతో 2014లో సర్పంచ్ గా ఎన్నికయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓడి పోయారు. బుధవారం నాడు అనారోగ్యంతో సమ్మయ్య చనిపోయిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి చైర్మన్ పోదెం వీరయ్య, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## జాతీయస్థాయి బాక్సింగ్ అండర్ 14 పోటీలకు ఎంపికైన ఎల్కతుర్తి విద్యార్థిని అమ్రిన్

- అమ్రిన్ కు దక్కిన అరుదైన అవకాశం
- పేద విద్యార్థినికి సహాయం అందించండి
- ఎంపికపై మండల ప్రజల హర్షం
- జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినిని అమ్రిన్ ను అభినందిస్తున్న డి వై ఎస్ ఓ అశోక్

**తొలి సమయం, ఎల్కతుర్తి / డిసెంబర్ 25**



మండల కేంద్రానికి చెందిన అమ్రిన్ జాతీయస్థాయి బాక్సింగ్ అండర్ 14 పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకెళ్తే మహమ్మద్ హుస్సేన్, యాకూబి ల కుమార్తె అమ్రిన్ శ్రీ చైతన్య పాఠశాలలో ఏడవ తరగతి చదువుతుంది.చిన్నతనం నుంచి ఆటల్లో ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహం అందించడంతో బాక్సింగ్ పై మక్కువ పెంచుకొని జిల్లా స్థాయిలో గుర్తింపు అనేక బహుమతులు సాధించింది.రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఈనెల 20, 21 తేదీలలోహైదరాబాద్ షేక్ పెట్ లో నిర్వహించగా అందులో గోల్డ్ మెడల్, బొచ్చు భార్గవ్ సిల్వర్ మెడల్ సాధించడంతో డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ మరియు బాక్సింగ్ కోచ్ దేవరకొండ ప్రభుదాస్ అభినందనలు తెలిపారు. జనవరి 10, 12 తేదీలలో జరగబోయే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అమ్రిన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రోత్సహిస్తే, ఆర్థిక చేయూతనిస్తే తప్పకుండా భవిష్యత్తులోజాతీయస్థాయిలో బాక్సింగ్ లో రాణిస్తానని ఎల్కతుర్తి గ్రామానికి పేరు తీసుకువస్తానని ధీమా వ్యక్తం చేశారు. జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడం పట్ల, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మండల ప్రజలు, ఎంపీడీవో, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వరరావు, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు,పలువురు నాయకులు, అభినందించారు.

## నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనం అటల్ జీ

**వాజపేయి 100వ జయంతి సందర్బంగా పారిశుధ్య కార్మికులను సన్మానించి వారికి వస్త్రాలు పంపిణీ చేసిన బీజేపీ నేత బేతి మహేందర్ రెడ్డి**



**తొలి సమయం, కరీంనగర్ /డిసెంబర్ 25**



నైతిక విలువలకు కట్టుబడి దేశ భద్రతను, సంక్షేమాన్ని, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లడడమే కాకుండా స్వపక్షం, విపక్షాలకు ఆదర్శప్రాయుడు మన మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ అటల్ బిహారి వాజపేయి ని వారి 100వ జయంతి సంధర్బంగా బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి కొనియాడారు. డిసెంబర్ 25, బుధవారం రోజున వాజపేయి చిత్రపటానికి నివాళులు అర్పించడమే కాకుండా కరీంనగర్ నగరపాలక సంస్థ 40వ డివిజన్ లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను శాలువాతో సన్మానించి వారికి పాంట్స్, షర్టులతో పాటు మహిళ కార్మికులకు చీరలు పంపిణి చేసిన అనంతరం స్వీట్లు పంపిణీ చేయడం జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. అలాగే వాజపేయి 100వ జయంతి ఉత్సవాలను సంవత్సరం పాటు జరుపుకోవాలని బీజేపీ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లాలోని వార్డులు, గ్రామాలు, మండలాల పరిధిలో చెడు వ్యర్థాలను, వాసనలను భరిస్తూ తమ ప్రాణాలకు తెగించి పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను స్థానిక బీజేపీ కార్యకర్తలు, నాయకులు అన్ని రకాలుగా ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నేత బేతి మహేందర్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు బేతి సుమలత, కట్ట సాయికృష్ణ, వావిలాల రోహిత్ రెడ్డి, ఉమ్మెంతుల శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎడ్ల రత్నాకర్ రెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గణిత దినోత్సవ క్విజ్ పోటీలో బహుమతులు గెలుచుకున్న లక్షణ ,గాక్షిత్

**అభినందించిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా**

**తొలి సమయం, హన్మకొండ /డిసెంబర్ 25**

హనుమకొండలోని హంటర్ రోడ్ లో గల జె ఎస్ ఎం పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవము పురస్కరించుకొని అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాల పై ఎగురవేసిన మహాగణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్బంగా ఏర్పాటు చేసిన జాతీయ గణిత దినోత్సవ గణిత క్విజ్ పోటీలో ప్రధమ ద్వితీయ బహుమతులు గెలుచుకున్న అక్క తమ్ముడు బయ్య లక్షణ గాక్షిత్ గంగపుత్రలను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ పాలక మండలి తరుపున అభినందనలు తెలియజేసి చిన్నారులను ఆశిర్వదించి రానున్న రోజులలో చిన్నారి సోదరి సోదరుడు బయ్య లక్షణ గాక్షిత్ గంగపుత్రలు విద్యతో పాటు సమకాలిన అంశాలలో తమ ప్రతిభ చాటి జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గోని మరిన్ని బహుమతులు గెలుచుకోవాలన్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101